# దివ్యదృష్టి

కృష్ణ



తాండూరు సమీపంలో జీవన్గి అనే కుగ్రామం ఒకటుంది. మొత్తం వంద ఇ ళ్ళుంటాయ్ - నాపరాళ్ళు రకరకాలుగా కప్పినవి - మామూలు నివాస గృహాల కంటే దిగువ స్థాయికి చెందినవి. ఆ ఇళ్ళ మధ్యన పాతబడిపోయినా హుందాగా, ఎత్తుగా కన్పించే భవనం ఒకే ఒకటుంది.

మాది అదే గ్రామం.

నేను 'ఉంది', 'ఉన్నాయి' అంటున్నాను గానీ 'ఉండేది', 'ఉండేవి' అనుండాల్సిందేమో! ఎందుకంటే ఇప్పుడు జీవన్గి గ్రామం రూపు రేఖ లెట్లా ఉన్నాయో నే నెరుగను. ముప్పై సంవత్సరాలైంది నే నా గ్రామాన్ని విడిచి - ఈ మధ్యలో ఒక్కసారైనా చూడలేదు. కావడానికి నాది ఆ ఊరే అయినా ఆ ఊరు నాది కాదు గదా - కనీసం ఆ ఊర్లో నా కేమీ లేదు గదా వెళ్ళి చూసుకోడానికి. అయినా ఇప్పటికీ ఎవరైనా అడిగితే 'మాది జీవన్గి గ్రామ మండీ' అని చెప్పుకుంటే పోగొట్టుకున్నది ఇంకా నా హక్కుభుక్తంలోనే ఉన్నట్లు యేదో తృప్తి అన్పిస్తుంది.

మా అక్క పెళ్ళి కాకపూర్వం జీవన్గిలో మా కో చిన్న ఇ ల్లుండేది. మా అమ్మ నా చిన్నతనంలోనే గతించింది. నాన్నా, అక్కా, నేను - అదీ మా కుటుంబం.

మా ఇంటికి దగ్గర్లోనే ఒక చిన్న దేవాలయం ఉండేది. ఎత్తుగా, హుందాగా ఉండే భవనం అని చెప్పానే - ఆ భవనం వారి పూర్వీకులే ఈ దేవాలయాన్ని కట్టించారు. మా నాన్న ఆ దేవాలయంలో పూజారి.

మేం జీవన్గికి రెండు మైళ్ళ దూరంలో ఉన్న బడికి వెళ్ళి చదువుకునే వాళ్ళం. మొత్తం ఓ పది మందిమి. ఈ పదిమందిలో ఆ ప్రాథమిక పాఠశాల తుది పరీక్ష దాకా వచ్చిన వాళ్ళు ఇద్దరో, ముగ్గురో - మిగతా వాళ్ళు తలా ఒక చోట దిగబడిపోయారు

రోజూ దేవాలయంలో ఉభయ సంధ్యలా పూజా నైవేద్యాలు చేసి రాత్రి ఎనిమిది కల్లా ఇంటికి వచ్చేవాడు నాన్న. అంతే - మర్నా డుదయం ఎనిమిదింటి వరకూ ఆ గర్భగుడిలో స్వామి ఒక్కడే బిక్కుబిక్కు మనుకుంటూ ఉండిపోయేవాడు.

సాయంత్రం అయిదింటి కల్లా బడి నుంచి వచ్చే వాళ్ళం మేం. వచ్చిన పావుగంటలో రెక్కలు గట్టుకుని దేవాలయం ఆవరణలో వాలే వాళ్ళం. ఆలయం రెండు పక్కలా, వెనుకా గన్నేర్లూ, మందారం పూలచెట్లే గాక రాచ ఉసిరి, తత్తురువళ్ళ చెట్లూ ఉండేవి.

ఆ ఆవరణలో తుడుము, కట్టెలాట, తొక్కుడు బిళ్ళ, అట్టా - చెమ్మా ఆడుతూ, కథలు చెప్పుకుంటూ, కబుర్లాడుకుంటూ దీప నైవేద్యాలు ముగిసిందాకా గడిపేవాళ్ళం. ఆ తరువాత ఒక్కొక్కరం తాళం వేసిన ఆ ద్వారం ముందు నిల్చుని స్వామిని ఒంటరిగా విడిచి వెళ్తున్నందుకు క్షమాయాచనగా చెంపలు వేసుకుని, దండం పెట్టి కాళ్ళీడ్చుకుంటూ ఇంటి మొగం పట్టేవాళ్ళం.

ఈ ఆటల్లో ఎక్కువ పెత్తనం చెలాయిస్తుండేదీ, తగాదా వచ్చినప్పుడు తీర్పులిస్తూ, శిక్షలు విధిస్తూ తుది నిర్ణయ మిచ్చేధి 'మనమే.' అందరూ నా పెద్దరికాన్నీ ప్రాబల్యాన్నీ అంగీకరించేవారు. ఆడపిల్లా - మగపిల్లవాడు అన్న విచక్షణ లేకుండా గుళ్ళో ఆడే ఆటల్లో అందరం పాల్గొనేవాళ్ళం. ఆటలోకి ఆలస్యంగా వచ్చిన వారికీ, ఆటను మధ్యలో వదిలి 'ఇంటి పిలుపు' కారణంగా వెళ్ళిపోయిన వారికీ, ఆటలో దొంగై బయట పడలేక మొండికేసిన వారికీ, ఆనాడో, మర్నాడో తగు శిక్ష పడ్తూండేది. ముప్పై గుంజీలు తీయడమూ, వరుసగా అందరికీ సలాములు చేయడమూ, గుడి చుట్టూ దేకుతూ ప్రదక్షిణం చేయడమూ - ఇట్లా ఉండేవి శిక్షలు.

ఒకసారి నేరం చేసిన వ్యక్తి మళ్ళీ ఆ నేరం చేయకుండా శిక్ష ద్వారా బుద్ధి చెబుతూనే మానసికంగా సంస్కరిస్తూండే ఆ శిక్షలు భారతీయ శిక్షాస్మృతికి ఆదర్శప్రాయంగా ఉండేవో, లేదో చెప్పలేను గానీ నాటి నా న్యాయపాలనలోని మూలసూత్రం మాత్రం 'ఆత్మానందమే' నని ఒప్పుకుంటున్నాను.

అటువంటి నా న్యాయపాలనలో సృజనాత్మకతను తెచ్చింది 'దొడ్డప్ప' ప్రవేశం. ఆ అమ్మాయి అసలు పే రేంటో అప్పటికి నాకు తెలియదు. ఆటలోకి ఆమెను తీసుకువచ్చిన అమ్మాయి 'దొడ్డప్ప' అని పిలిచింది. అంతా అదే పేరుతో పిలిచాం.

దొడ్డప్ప నల్లటి సెలుపు. ఆరోగ్యంగా, దృఢంగా ఉండేది. పొడగరి అయినా నిడుపాటి ఆమె జడ మోకాళ్లను తాకుతూండేది. అయితే - అసలు విషయం చెప్పాలిగా - ఆ రోజుల్లో మమ్మల్ని అమితంగా ఆకర్షించిన విషయం ఆమె చాయా కాదు - ఎత్తూ కాదు - పొడవాటి జడా కాదు. పళ్ళు! ఔను. ఆమె పై పళ్ళు పెద్ద పెద్ద పళ్ళు!

బాల్యమే అంత చూడండి. ఏ పిల్లవాడి కంటిని ఏమాకర్షిస్తుందో చెప్పలేము. ఎన్నో రోజులుగా అన్నమానమూ కలిసి ఆడుతూనే

ఉంటారు. ఏదో ఒక రోజున ఇద్దరికీ తగాదా వచ్చి తిక్క తిరుగుతుంది. చెట్టావట్టీ కాస్తా ఝట్‌వట్ అయిపోతుంది. పెదాలు ముడుచుకుని, కండ్లు చిట్లించి, తీక్ష్ణంగా ముక్కుల్నుంచి ఆవిర్లు విడుస్తూ - ఒకళ్ల నొకళ్లు దుర్వాస - విశ్వామిత్రుల్లాగా చూసుకుంటారు. అంతే చూసీ చూసీ చూసి - ఒకడి పెదాల్లోంచి టక్కున బైటవడ్తుంది వరమసత్యం - 'ఘో ఘోరా - బుర్ర ముక్కూ!' అప్పుడు గాని తెలీదు ఇరువురిలోనూ వరస్పరం ఆకర్షించిన విషయమేంటో!

చూసిన సాయంత్రమే ఒకడు బైటపెట్టాడు దొడ్డప్ప వళ్లు చూస్తే తన కేమన్పించిందో. మరొకడు ఆ వళ్లు సార విత్తుల్లా కన్పించా యన్నాడు. మరొకడికి మరో జీవి వళ్లు గుర్తుకు వచ్చేయి. ఇట్లా ఎవరికి తోచిన పోలిక వాళ్లు చెప్పుకుని విరగబడి నవ్వుకున్నాం నిర్దయగా. ఒకరి శారీరక వైకల్యాన్ని గానీ, వికృతిని గానీ చూసి వరివాసించగూడదన్న విలువైన నీతి తెలిసే వయసు కా దది.

ఒక్క పిల్లవాడు మాత్రం - అంతకుముందు ఎప్పుడూ ఎవర్నో ఒకర్ని వెక్కిరిస్తూనే ఉండేవాడు - మేం ఈ దొడ్డప్పని వరివాసించ మొదలెట్టిం దగ్గర్నుంచీ మా అవభాషణంలో పాల్గొనకుండా, నవ్వనేనా నవ్వకుండా, మమ్మల్ని ఒకళ్లని మార్చి ఒకళ్లని దొంగల్ని చూసినట్లు చూడసాగేడు. మా మాటల్ని వింటున్న కొద్దీ వాడి భృకుటి ముడుచుకుని పోసాగింది.

మూడ్రోజు లట్లా గడిచేక నాలుగో రోజు నుంచి వాడు మా ఆటలోకి రావటమే మానేశాడు. అయితే వా డట్లా మారటానికి కారణమేంటో మా రాక్షసమూక కనిపెట్టకపోలేదు. అది చెప్పుకుని మళ్లీ మేం కిందా మీదా వడి నవ్వుకోడం.

అ దంతా గుర్తు చేసుకుంటే నాకు సిగ్గుతో, అవరాధ భావంతో తల వాలిపోతూంటుం దిప్పటికీ.

దొడ్డప్ప మా కంటె ముందుగానే వచ్చి కూర్చునేది ఆలయ మంటవంలో. ఆ తరువాత కాసేవటికి మేం జట్టుగా వస్తూ ఎదురుగా దొడ్డప్ప కన్పించగానే ముఖాలు ముఖాలు చూసుకుని నవ్వే వాళ్లం.


మా ముఖాలపైన నవ్వు చూడగానే దొడ్డప్ప కళ్లు విప్పారేవి. తనూ మాతో శ్రుతి కలిపి నవ్వేది. ఇంకేం - ఇక ఆ వెర్రి బాగుల దొడ్డప్పను చూసి వకవకల్లోకి విరుచుకువడ్డం మా వం తయ్యేది.

దొడ్డప్ప నవ్వు ఆగిపోయేది. ఆ పెద్ద పెద్ద కళ్లతో మార్చి మార్చి చూసేది మమ్మల్ని నందేహంగా, అనుమానంగా. ఆట మొదలేసి అందులోకి తనను తీసుకునే వరకూ అదే నందేహం - అదే ఆందోళన.

అయితే ఆటలోకి రాగానే మళ్లీ దొడ్డప్ప ముఖం విప్పారేది. నవ్వు అలుముకునేది. మా రాకాసి మూకకి చక్కిలిగిలి పెట్టినట్లయ్యేది.

దొడ్డప్ప ఆట కేనాడూ ఆలస్యంగా వచ్చేదీ కాదు - మధ్యలో ఎప్పుడూ పారిపోయేదీ కాదు. ఇక దొంగైనాక మొండికేయడ మంటారా - అసలు ఆటలో తాను దొంగైతేనే దొడ్డప్పకి ఆనందం!

## రికార్డు సృష్టించిన 'మాయలోడు'



**నగరంలో** శ్రీనివాస థియేటర్లో రోజుకు నాలుగు ఆటల చొప్పున ఇప్పటికి 175 రోజులు ప్రదర్శింపబడుతోంది. మరో అయిదు వారాలు నడుస్తుందని ఆ థియేటర్ ఓనర్ బాపిరాజు చెప్పారు. ఇప్పటికి ఈ ఒక్క థియేటర్లో వచ్చిన షేర్ 9,85,722 రూపాయలని లెక్కలు చూపారు.

మనీషా నిర్మాతలు, హీరో రాజేంద్రప్రసాద్ ఈ 175వ వర్వదిన నందర్భంగా ఆ థియేటర్‌కు వచ్చారు. ప్రేక్షకులందరికీ బాపిరాజు బిస్కెట్లు వంచారు.

"నా థియేటర్‌లో ఇంతకుముందు 'ఎంటర్ ది డ్రాగన్' ఇంగ్లీషు చిత్రం [210 రోజులు], తర్వాత 'మావల్లెలో గోపాలుడు' [190 రోజులు] ప్రదర్శించి రికార్డు సృష్టించాయి. ఇప్పుడు 'మాయలోడు' 211 రోజులు ప్రదర్శిస్తాం. రికార్డు సృష్టిస్తాం. వబ్లిసిటీ లేని చిత్రం ఇది. ప్రజలే ప్రచారం చేసి, కుటుంబసమేతంగా వచ్చి చూసి ఆనందిస్తున్నారు. అందుకే ఈ హీరోకి, డైరెక్టర్‌కు, నిర్మాతలకు నా కృతజ్ఞతలు చెబుతున్నాను. చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు థాంక్స్ చెబుతున్నాను" అన్నారు.

"ఇది నా మాతృ సంస్థ. ఈ సంస్థ ఎప్పుడూ మంచి చిత్రాలే తీస్తుంది. ఆ సంస్థ ఏది చేసినా మంచే చేస్తుంది. ఆ ఆనందం నాది" అన్నాడు రాజేంద్రప్రసాద్.

"నా కెవరూ గురువు లేరు. రాజేంద్రప్రసాద్ నా గురువు. ఆదినుంచీ నన్ను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నాడు. ఇది నా ఒక్కడి విజయం కాదు. ఇదొక ఫామిలీవంటిది. అందుకే ఫామిలీ సభ్యులందరి ఆనందానికి చిత్రాలు తీస్తున్నాం. మాకు మేమే క్రిటిక్స్‌లాంటివారం. ఏ మాత్రం అసభ్యతని తోచినా మాకు మేమే సెన్సార్ చేసేసుకుంటాం. చిత్ర విజయానికి దోహదపడినది మొదటి నుంచీ పత్రికలవారు. మనమధ్య ఆ అనుబంధం పెనవేసుకుని వస్తోంది. అది అలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను" అన్నారు రచయిత, దర్శకుడు, సంగీత దర్శకుడు అయిన ఎస్. వి. కృష్ణారెడ్డి. ఎస్.వి. కాదు. ఆ యువకుడు చిత్రరంగంలో విచిత్రమైన 'యశస్వి' అని హర్షామోదాలు తెలిపారు అభిమానులంతా.

యశోధర

ఆటకి ప్రాణం దొంగే కదా. కావాలని తానే దొంగై నవ్వుల్లో ఊగిపోతూ, వరవశిస్తూ ఆటలో పాల్గొనేనాటి దొడ్డప్ప!

నేటికీ గుర్తుకు వచ్చినప్పు డల్లా నా కళ్లను చెమ్మగిల జేస్తుంది. నాటి మా రాక్షసానందం జ్ఞాపకాలు నా మనస్సుని చిత్రవధతో శిక్షిస్తూనే ఉంటయ్. కానివ్వండి చెబుతాను - చేసిన పావం చెబితే పోతుం దంటారుగా.

దొడ్డప్పని శిక్షించడానికి అవకాశమే దొరక్కపోయేది. ఏదో ఒక అవకాశం కల్గించుకుని ఆమెని శిక్షించాలని ఆత్రవడసాగేము. నే నా వని చేయటంలో విఫలుణ్ణి కావడం మా మిత్ర బృందానికి నా అసమర్థతగా కన్పిస్తుందేమోనని నేను భయవడసాగేను కూడ.

మొత్తానికి - ముందే నిర్ణయించిన వథకం ప్రకారం ఒక రోజున దొడ్డప్పని న్యాయస్థానానికి లాగనే లాగేను - 'ఆటలో తప్పు ఆడినందుకు.'

విస్తుపోతూ, అర్థం కానట్లు ప్రశ్నార్థకంగా చూసింది దొడ్డప్ప - "ఎందుకూ! నే నేం తప్పు ఆడానూ?"

"ష్ - అట్లా ఎదురు మాట్లాడగూడదు దొడ్డప్పా - అట్లా మాట్లాడ్తే అసలు ఆటలోకే రాకుండా చేస్తాడు రాజా" అని హితభిషిలా హెచ్చరించాడు రవీంద్ర - నా తోడు దొంగ.

దాన్తో దొడ్డప్ప సులువుగా దారిలోకి వచ్చింది. "నరే చెప్పండి. నలాములు చెయ్యాలా?"

"ఊహుఁ" అడ్డంగా త లూపేను నేను గంభీరంగా.

"గుంజీలు తియ్యాలా?"

"ఊహుఁ"

"ప్రదక్షిణం చెయ్యనా?"

"ఊహూఁ - అ దేదీ కాదు." రవీంద్రతో నహా అందరూ ఆదుర్దాగా నాకేసి చూడసాగేక కొంగొత్త శిక్షను ప్రకటించేను - "వంద వొంట్లు లెక్క బెట్టేందాకా నవ్వకుండా నిల్చోవాలి."

అంతా విస్తుపోయారు. నా తెలివి తేటలపై నమ్మకం పోతూన్న వాడిలా కన్పించేడు రవీంద్ర.

"ఎట్లా!? ఎట్లా?! నా కేమీ అర్థం కావడంలేదు" అన్నది దొడ్డప్ప.

నేను గంభీరంగా లేచి "చెబుతా" నంటూ

దొడ్డవ్వని తీసుకుపోయి వేదిక లాంటి ఓ బండపై కెక్కించాను.

"సరే" చేతులు కట్టుకుని నిల్చుంది దొడ్డవ్వ బండపైన - "వొంట్లు లెక్కబెట్టండి."

"ఊహుఁ - అట్లా ఆకాశంలోకి చూస్తూ నిల్చోవడం కాదు - నువ్వు రవీంద్ర ముఖం వైపు చూస్తూనే నిల్చోవాలి. రవీంద్రేమో నిన్ను నవ్వించడానికి ప్రయత్నం చేస్తాడు. గోపీ వంద వొంట్లు లెక్కబెడ్తాడు. నవ్వకుండా ఉండటమంటే ఏంటో తెల్సా - అస్సలు నీ పళ్లు బైటికి కన్పించగూడదు. తెల్సిందా" అంటూ శిక్షను వివరించి రవీంద్ర వైపు చూశాను.

దయ్యపు ఆనందంతో వెలిగిపోతున్నయ్ వాడి కళ్లు.

త లూపింది దొడ్డవ్వ. ఎంతో ప్రయత్నించి రెండు పెదాల్ని ముందుకు సాగదీసి పై పళ్లని కప్పేసి "సరేనా?" అన్నట్లు చూసింది.

"ఆఁ అదీ - అట్లా" - త లూపి "కానీంద్రా రవీంద్రా - గోపీ" అని ఆనతిచ్చి నేను సింహాసనాన్నలంకరించాను.

రవీంద్ర వచ్చి దొడ్డవ్వ కెదురుగా కూర్చున్నాడు. కూర్చుని స్వతస్సిద్ధమైన తన కోతి ముఖంలో రకరకాల కవళికల్ని చూపుతూ దొడ్డవ్వకు వ్రతభంగం చెయ్యడానికి పూనుకున్నాడు.

తా పీగా వొంట్లు లెక్కబెట్టసాగేడు గోపీ.

తొంభై లెక్కబెట్టిందాకా దీక్షగానే ఉంది దొడ్డవ్వ. మరి ఆ పైన రవీంద్ర కోతి వేషాలు చూసి జాలి వేసిందో - శిక్ష పుణ్యమాని తనకు లభించిన ప్రాముఖ్యతని పోగొట్టుకోవడం ఇష్టంలేకపోయిందో 'పకపక' మననే అంది. చెల్లు! మళ్లీ శిక్ష మొదలు!

ఇదీ మొదటి సంఘటన.

దొడ్డవ్వ రాకతో మా బాలరక్కసి బృందానికి కోతికి కొబ్బరికాయ దొరికినట్లైంది.

భవనం వా రింటికి వచ్చిన చుట్టాలమ్మాయిని మాకు తెలిసింది గానీ ఆ హెూదా దొడ్డవ్వ కేమీ రక్షణ నివ్వలేకపోయింది. రోజూ ఉదయమో, సాయంత్రమో శిక్ష పడాల్సిందే.

శిక్ష అనగానే ఇం కేమీ చెప్పాల్సిన అవసరం లేదన్నట్లు వెళ్లి ఆ బండపైన ఎక్కి నిల్చునేది. గ్లాసు ఖాళీ చేస్తున్నట్లు కాసేపు కళ్లు మూసుకుని గలగల నవ్వేది.

ఆ తరువాత పేద్ద త నేదో మహాకార్యం చేయబోతూన్నట్లు పరికిణీ, జాకెట్టు సరిచూసుకుని ముంగుర్లు సవరించుకుని, భుజం మీదికి వచ్చిన జడని వెనక్కి వేసి, చేతులూ, కాళ్లూ కుదురుగా ఉంచి, ఒకసారి నాలుకతో పెదాలను తడి చేసుకుని, కనురెప్పలు వాల్చి అంత సరిచూసుకుని -

నిజం - నేను సాగదీయడం గానీ, కల్పించి చెప్పడంగానీ కాదు. అంత హంగామా చేయాల్సిందే. పోనీ అంత హంగామా చేసిందీ ఆ వంద అంకెల వ్రతం ఒక్క ప్రయత్నంతో ముగించేదా అంటే అదీ లేదు. ఎనభై తొమ్మిది, తొంభై మూడు - అట్లా వందకి 'నాలుక జాపు' దూరంలోకి వచ్చిం దల్లా పకపకమని నవ్వి వ్రత భంగం చేసుకునేది దొడ్డవ్వ!

ఈలోగా బండ మీద నిల్చున్న దొడ్డవ్వ కెదురుగా - దేవత ముందు ఉపాసకుడిలా బాచిపట్లు వేసుక్కూర్చుని బాగా సాధన చేసిన వాడిలా మూతీ ముక్కూ, చెవులూ తిప్పుతూ ఆడిస్తూ తన ప్రతిభా విశేషాలన్నీ ప్రదర్శిస్తూండే వాడు 'కోతీంద్ర' దొడ్డవ్వ పకపక మనే వరకు. ఆ తరువాత వెనుదిరిగి అందరి వంకా గర్వంగా చూసేవాడు 'చూశారా - మన తడాఖా!' అన్నట్లు.

వరుసగా మూడు సంవత్సరాలు శలవుల్లో జీవన్గికి వచ్చింది దొడ్డవ్వ.

మూడో సంవత్సరం నా చదువు ఏడు పూర్తై ఎనిమిదో తరగతికి తాండూరు వెళ్లిపోయాను. ఆ సంవత్సరం శలవుల్లో చివరిసారి దొడ్డవ్వని చూడటం - వాళ్ల నాన్న పోయా డన్నారు.

దేవాలయం ఆవరణలో మా స్థానాన్ని మరో తరం ఆక్రమించింది.

ఎప్పుడో ఓ సారి నేనూ, గోపీ, రవీంద్రా కలుసుకున్నప్పుడు మా ఆటల్ని గురించి గుర్తు చేసుకుని వినోదించే వాళ్లం.

తను ఊళ్లోనే ఉంటున్నాడు గనుక 'ఇప్పటి పిల్లల' ఆటల్ని గమనిస్తూండే వాడేమొ రవీంద్ర - కొంచెం విచారంగా అనేవాడు. "ఏమైనా ఈ పోరల ఆటలో ఆ మజా లేదురా రాజా, ఈ హెూలాగాండ్లని ఆడపోరలే ఏడ్పిస్తుంటారు."

తరువాత విధి విచిత్రమైన మలుపులు తిప్పింది నా జీవితాన్ని.

మా అక్క వివాహం కాగానే అంతటితో తన బాధ్యత తీరిం దన్నట్లు మా నాన్న నిష్క్రమించాడు. అక్క బావతో వెళ్లిపోవాల్సిన ఘడియ వచ్చింది. రంగ స్థలం పైన ఒంటరినైపోయిన ఆ క్షణాన -

పదో తరగతి పూర్తయిన నా చదువు బాధ్యతను తీసుకుంటానని భవనం వా రింటికి వచ్చిన ఓ పెద్ద మనిషి ముందుకు వచ్చేడు. ఆ పెద్ద మనిషే విఠోబా గారు.

విఠోబాజీ దొడ్డవ్వ చిన్న తా త గారు. హైదరాబాదులో ఆయనకు కారవాన్‌లో వెనుకటి కాలపు మేడ ఒక టుంది. ఆయన సంగీత విద్వాంసుడు. చిన్నతనంలోనే ఇ ల్లొదిలి ఉత్తర దేశం పోయాడు. భట్‌కండే అనే విద్వాంసు డింట చేరి శుశ్రూష చేసుకుంటూ సంగీతం నేర్చుకున్నాడు. తిరిగి వచ్చేక నిజామ్ ప్రభువు నాశ్రయించి విద్వత్తు ప్రదర్శించి మన్ననలనీ, దాన ధర్మాలనూ పొందాడు.

కారవాన్‌లో ఆ మేడ పై గదిలో ఉంటూ పై చదువు రెండు సంవత్సరాలు చదివాను నేను. తెల్లవారు జాము నుంచి రాత్రి పొద్దు పోయే వరకు విఠోబాజీ సంగీత శిక్షణ; శిష్యుల శిష్యరాండ్ర కీర్తనలు, హార్మోనియమ్, ఫిడేల్‌పై ఏ లోకాల్లోనో మనసును విహరింపజేసే రాగాలు నిర్విరామంగా కొనసాగుతూండేవి.

నిర్భాగ్యుడినైన నా పట్ల విఠోబాజీ ఇంత ఔదార్యం చూపటానికి కారణం ఉంది. తన మనుమరాలు దొడ్డవ్వకు కాగల మగదిక్కుగా కన్పించాను నేను. మా అక్కా, బావల మాటల్లో సూచనగా ఆ సంగతి తెలిసిందే గాని ఆ పెద్ద మనిషి నాతో ఎన్నడూ ఆ ప్రస్తావన తేలేదు.

ఆ రెండేళ్లూ టీలు, టిఫేన్‌లు, స్నాన భోజనాలలో నా అవసరాలన్నీ తానే చూసేది దొడ్డవ్వ. నేను కాలేజీ నుంచి రాగానే తన సంగీతాభ్యాసాన్ని కట్టి పెట్టి వచ్చేది. 'రాజా - కొంచెం టిఫిన్ తీసుకురానా?'', 'రాజా - ఏమి టలాగున్నావు - తల నొప్పిగా ఉందా? అమృతాంజన్ తెచ్చేదా?' - 'రాజా ఏదీ నన్ను నవ్వించు చూదాం.'

దొడ్డవ్వను చేసుకోవాలన్న ఉద్దేశం నా కే కోశానా లేదు. అయితే అట్లాగని నే నెవరికీ చెప్పలేదు. ఆ పిల్లని నా కంట గట్టాలన్న ఆ పెద్ద మనిషి ఊహ కుయుక్తిలా, పేరాశలా అన్పించేది నాకు. 'అసలు ఎవరేనా చూస్తూ చూస్తూ ఆ పిల్లను ఎట్లా చేసుకుంటారు?' అనుకుని విస్తుపోయేవాణ్ణి.

రెండు సంవత్సరాలు పోయాక విఠోబాజీ కుటుంబానికి చెందిన ఓ పెద్దవ్వ పరిహాసోక్తులు చేస్తూనే దొడ్డవ్వతో నా వివాహం ప్రతిపాదించింది.

తల వంచుకుని స్పష్టంగా నా అయిష్టాన్ని తెలిపాను. అప్పు డొక ప్రమాదం నుంచి బైట పడ్డట్లన్పించింది.

అయిష్టాన్ని బైట పెట్టాను గాని ఆ తరువాత దోషిలా తలవంచుకునే రెండు మూడు నిమిషాలు కూర్చున్నాను. అప్పు డక్కడున్న వారిలో ఎవరున్నదీ, ఎవరు లేనిదీ నేను గమనించలేదు.

ఆ నిశ్శబ్దం మాత్రం వాళ్లు నిర్ఘాంతపోయినట్లు, నిర్విణ్ణులైనట్లు - పరిపరి విధ వ్యాఖ్యానాల్ని ప్రకటించింది.

త లెత్తగానే తెరచి ఉన్న ద్వారమే కన్పించింది. బయటకు వచ్చేశాను.

ఆ తరువాత మరి దొడ్డవ్వ నాకు కన్పించలేదు.

నాకు నచ్చిన, ఉద్యోగ మిప్పించిన పెద్ద మనిషి బిడ్డని పెళ్లి చేసుకున్నాను. మరో విధంగా చెప్పాలంటే తన బిడ్డని చేసుకునే షరతు మీదే నా కుద్యోగ మిప్పించా డాయన.

భౌతికమైన సౌందర్యం - దాని పట్ల ఆకర్షణ రెండూ చంచలమైనవే. మనం మెచ్చిన, కాంక్షించిన సౌందర్యం - ఆ కనులూ, ముక్కూ, పెదాలూ, ముంగుర్లూ అన్నీ అట్లా ఉండగానే -

### ఈసారైనా....

"డాక్టర్ గారూ! మీరు దయచేసి వెంటనే రావాలండి. నా భార్య విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతుంది. అపెండిసైటిస్ అయి ఉంటుంది." ఆందోళనగా అర్ధరాత్రి వేళ ఫోన్ చేసి చెప్పారు రాజలింగం.

అందు కా డాక్టర్ గారు "భయపడాల్సిన పని లేదు, రేపు పొద్దున వచ్చి చూస్తాను" అన్నారు.

"అదికాదు డాక్టర్, వెంటనే రావాలి మీరు." దీనంగా వేడుకున్నాడు రాజలింగం.

ఈసారి డాక్టర్ మండిపడుతూ - "రెండేళ్ల క్రితం నీ భార్యకి అపెండిసైటిస్ ఆపరేషన్ చేసింది నేనే" అంటూ అరిచాడు.

"అదికాదు డాక్టర్! ఆవిడ పోయింది కదా! ఈవిడ నా రెండో భార్య." అసలు విషయం చెప్పారు రాజలింగం.

*గుజ్జుల వెంకటకృష్ణారెడ్డి [హైదరాబాదు]*

ఎట్లా ఇంకిపోతుందో, అదృశ్యమైపోతుందో అనుభవపూర్వకంగా తెలియాల్సిందే.

రోగాలు, రొష్టులతో యమ యాతనలు పడి చివర కో ఆడపిల్లను కని కన్ను మూసింది నా భార్య. ఆ పది సంవత్సరాల అనుభవాలు మళ్లీ వివాహం గురించి ఆలోచించకుండా చేసినయ్.

బిడ్డకు 'వాణి' అని ఎంతో ఇష్టపడి పేరు పెట్టుకున్నాను. కన్నూ, ముక్కూ, మొహం, చాయ, వేలెత్తి చూపటానికి ఎక్కడా లోపం లేదు. కానీ తల్లి కొరనోమో, తండ్రికి పడ్డ శిక్షో తెలీదు. వాణి నిర్వాణి అయింది. ఎందరు డాక్టర్లకు చూపించినా ప్రయోజనం లేకపోయింది.

మూగ - చెవిటి పిల్లల విద్యాలయంలో చేర్పించాను. నేర్వ గల విద్య లన్నీ నేర్చింది గానీ ఒక్క పేరు మాత్రం సార్థకం చేసుకోలేకపోయింది.

వాణిని చూసిన వాళ్లందరికీ ఒక అద్భుతంలానే కన్పించేది. ఇంత చక్కటి బొమ్మని చేసి నోరు ఎందుకు మూసేశాడు భగవంతుడు. అన్పించేది ప్రతి ఒక్కరికీ. 'భగవంతుడి లీల' అని వాళ్లే వ్యాఖ్యానం చేసేవాళ్లు.

తన లీలామయమైన సత్తకి నిదర్శన చూపటానికి ఒక అమాయక జీవి నిట్లా శిక్షించాలా భగవంతుడు అని నేను మథనపడుతున్నాను.

వాణి మాత్రం ముఖాన చెరగని చిరునవ్వుతో - త నొక శిక్షాగ్రస్తలా కాని, శాపబద్ధలా గాని కాక లీలా అభివ్యక్తిలా కన్పిస్తుంది - నాకు తప్ప చూసిన వా రందరికీ.

రెండు సంవత్సరాల నుంచీ ఆమె నొక ఇంటి దాన్ని చేయాలని ప్రయత్నిస్తున్నాను. పదికి పైగా సంబంధాలు చూశాను. ఒక అమ్మాయికి వివాహం కావటానికి కావలసిన అత్యవశ్య అర్హతలలో గొంతు కూడా ఒకటని ఎన్నడూ అనుకోలేదు.

మూడు వారాల్క క్రితం ఒక పిల్లవాడు వచ్చి చూసి వెళ్లాడు. అతను ప్రభుత్వోద్యోగి, పోలియోతో ఓ కాలు పనికి రాకుండా పోయింది గాని చూడటానికి బాగానే ఉంటాడు. తల్లిదండ్రులూ, తోబుట్టువులూ లేరు. మేనమామ ఉన్నాడు.

నేను పెద్ద ఆస్తిపరుణ్ణేమీ కాకపోయినప్పటికీ ఇన్నేళ్లలో సంపాదించిన ఆ కాస్త, ఉద్యోగ రీత్యా నేను మిగిల్చే దంతా నా బిడ్డకే చెందుతున్న విషయం పిల్లవాడి మేనమామకి నచ్చినట్లే అన్పించింది.

నగరానికి వెళ్లి తమ అభిప్రాయం తెలియబరుస్తామని చెప్పిన వాళ్లు పదిహే నిరవై రోజులు గడిచినా జవాబు రాయలేదు. రిప్లై కార్డూ రాశాను. దానికీ సమాధానం రాకపోవడంతో మునిగిపోతున్న మనిషి గడ్డి పోచ కోసం బారవేసినట్లు బయల్దేరి నగరానికి చేరాను.

శ్రీనగర్ కాలనీ సంపన్ను లుండే ప్రాంతం లాగుంది. నా క్కావల్సిన మనుషులు ఈ కాలనీలో. ఉండేంత సంపన్నులు కారు మరి - అనుకుంటూనే వెదుకుతూ మలుపు తిరగ్గానే నేను వెదుకుతూన్న ఇంటి నంబరు ఎదురుగా కన్పించింది - 'విష్ణు' అని బోర్డు ఉంది.

పెద్ద భవనం. దిక్కులు చూస్తూ గేటు మీద చప్పుడు చేశాను.

### 'నా కెలా తెలుస్తుంది'

ఓ స్నేహితురాలి పుట్టిన రోజు పండగకి ఏదైన మంచి పుస్తకాన్ని ఇవ్వాలని, పుస్తకాల షాపులోనికి నడిచింది రజని. కాసేపటికి ఓ పుస్తకాన్ని ఎన్నుకుని బిల్లు ఇవ్వ మని అక్కడి గుమస్తాకు అందించింది.

ఆఖరి నిమిషంలో ఆ పుస్తకం కవర్ పేజీ నీళ్లలో తడిసి ఉండటం గమనించి - "ఏమండి! ఈ పుస్తకం కొంచెం బావున్నట్టు లేదు కదూ!" అన్నది రంజని.

"నా కెలా తెలుస్తుంది మేడం, అయినా పుస్తకాలు చదివేంత టైం మా కెక్కడిది?' జవాబిచ్చాడు గుమస్తా.

గుజ్జుల వెంకటకృష్ణారెడ్డి [హైదరాబాద్]

పనిపిల్ల గావాల్ను వచ్చి అడిగింది.

నేను చెప్పిన పేరు వినగానే "ఆయిన పెండ్లి తిరపతిలో - నిన్ననే బొయిన్రు" అన్నది.

నా కాళ్లు చల్లబడ్డాయి. నోరు తెరచి అట్లాగే చూస్తూ నిల్చున్నాను.

ఇంతలో "ఏయ్ బాలా! ఆ అయ్యని పైకి తీసుకురా" అని పరిచిత స్వరం విన్పించింది. ఎవరి దీ స్వరం అని విస్మయంగా తలెత్తి చూస్తే.

నవ్వుతూ కన్పించింది దొడ్డప్ప!! గుర్తించడం పెద్ద కష్ట మేమీ కాలేదు.

ఆశ్చర్యంలో కొట్టుకు లాడుతూ ఆ పిల్ల వెంట మెట్లెక్కి పై అంతస్తుకి వెళ్లే లోపున మనస్సు పరిపరి విధాల ఊహించసాగింది. ఈ ఇల్లు దొడ్డప్పదేనా? లేక బంధు రూపేణా ఆమె ఇక్క డుందా? లేక ఈ ఇంట్లో వంట మనిషిగా గాని పనిచేస్తున్నదా దొడ్డప్ప?

ఎదురు వచ్చింది దొడ్డప్ప నవ్వుతూ - "ఏం బాగున్నావా రాజా?" అన్నది తనను నేను గుర్తుపట్టే ఉంటా నన్న ధీమాతో.

సోఫాలో కూర్చుని దొడ్డప్ప ఇచ్చిన చల్లని నీరు తాగాక ప్రాణం కాస్త కుదుటబడ్డది. నేను వచ్చిన పని వివరించాను.

విస్మయంతో, చిరు నవ్వుతో వింటూ 'ఊఁ' కొడ్తూ కూర్చుంది దొడ్డప్ప నా ముఖంలోకి తదేక దీక్షగా చూస్తూ. ఆ చూపును బట్టి అనుకున్నాను పాతిక ముప్పై సంవత్సరాల జ్ఞాపకాలు ఆ మనస్సులో మెదల్తున్నాయని.

అంత పరధ్యానంలోనూ దొడ్డప్ప ముఖం మీద స్వాభావికమైన ఆ చిరు నవ్వు చెరగలేదు. కొన్ని సెకన్లలోనే ఆ చిరు నవ్వు ఎన్నో జ్ఞాపకాల్ని తెచ్చింది నాకూను.

అడుగుతూంది దొడ్డప్ప - సమాధానాలు చెబుతున్నాను. ఐతే నేను చెప్పిన సమాధానాలు దొడ్డప్ప అడిగిన ప్రశ్నలకు మాత్రమే. ఆమె అడగని అనేక ప్రశ్నలకు నా వాలకమే సమాధానం చెప్పి ఉంటుంది.

ఇంతలో దిగువన కారు హారన్ విన్పించింది.

చిరు నవ్వుతో దిగ్గున లేచింది దొడ్డప్ప - "అయ నొచ్చినట్లున్నారు. ఉండు రాజా - సమయానికి రానే వచ్చారు - పరిచయం చేస్తాను" అని హడావుడిగా కిందికి పోయింది.

కాసేపట్లో చేయి పట్టుకుని మెట్లెక్కించుకుంటూ నెమ్మదిగా తీసుకు వచ్చింది భర్తను.

అప్రయత్నంగా సోఫా లోంచి లేచాను - "సమస్కారం" వెలువడ్డది నా నోటి నుంచి.


దొడ్డప్ప చెప్పనవసరం లేకుండానే తెలిసిపోయింది ఆ నల్ల కళ్లద్దాల వెనుక వెలుగూ చీకటుల ద్వంద్వాత్వం తెలీని క ళ్లున్నాయని. కానీ ఏం మూర్తి! ఏం తేజస్సు! కథల్లో, కావ్యాల్లో చదివాను గాని ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను.

నా చేతు లింకా జోడించే ఉన్నాయి. చూపులు వాలి ఆయన పాదాలపై నిలిచాయి.

ప్రసన్నమైన ఆ ముఖంపైన చల్లని పలకరింపు లాంటి చిరునవ్వు కొలనులో వెలుగుకు చైతన్యాన్ని జోడిస్తూ ప్రతిఫలించే అలలా తొణుకు లాడుతూంది." చాలా సంతోషం చాలా సంతోషం - మిమ్మల్ని గురించి ఎప్పుడూ చెబుతూంటుంది దొడ్డప్ప" అంటూ ఒక్క తడుముతో సోఫాలో కూర్చున్నాడు.

నన్ను గురించా? ఎప్పుడూనా? ఏం చెబుతూంటుంది దొడ్డప్ప?! ఏ ఘనమైన చరిత్రని?

"కూర్చో రాజా - కూర్చో." చనువుగా అంది దొడ్డప్ప అలుపులేని చిరు నవ్వుతో.



వా ళ్లిద్దరి ముందూ మరుగుజ్జై పోయి చూస్తూ కూర్చుండిపోయాను. జీవితం కంటే సంభ్రమాశ్చర్యకరమైన నాటకం లేదు. విధాతను మించిన ఉపాధ్యాయుడు లేడు - ఎటొచ్చీ అర్థం చేసుకోవడంలోనే అశక్తత!

దొడ్డప్ప భర్త - విష్ణుమూర్తి వచ్చని పసిమి. చక్కని ముక్కు. విశాలమైన నుదురు. ఆజానుబాహువు - ఇన్నీ ఇచ్చి చూపు లేకుండా చేశాడే విధాత! ఆ చూపే ఉండి ఉంటే -

"మా అబ్బాయి -" నన్ను ఆలోచనల్లోంచి కుదుపుతూ అప్పుడే వచ్చిన కొడుకుని పరిచయం చేసింది దొడ్డప్ప - "విఠోబా - గుర్తుందిగా - మా తాత" అని నవ్వింది.

నమస్కారం చేశాడు విఠోబా నవ్వుంగా. పాతి కేళ్లుంటాయి. ఆ చాయా - ముక్కూ - మొహం అచ్చం తండ్రే. కాకపోతే తల్లిగా దొడ్డప్ప కొడుక్కి తన పెద్ద కళ్లను ప్రసాదించింది.

తల్లి ఆదేశానుసారం నన్ను తీసుకువెళ్లి ఇ ల్లంతా చూపించాడు విఠోబా.

విష్ణు గారు సాధన చేసే గది చూశాను. ఆయన వివిధ ప్రదేశాల్లో, విదేశాల్లో చేసిన సంగీత కచేరీల ఫోటోలు, సన్మాన పత్రాలు, సంగీత నాటక అకాడమీ వారి సభ్యత సత్కారం అందుకొంటూన్న ఫోటో - మధ్యప్రదేశ్ ప్రభుత్వం వారి సన్మాన పత్రం - అద్దాల కేసులో విష్ణు గా రిచ్చిన ఎల్పీలు, విదేశాల్లో ఆయన్ను వరించిన సత్కారాలు - అన్ని ఫోటోల్లోనూ ఆయన వెనుకనే శాలువా కప్పుకునీ, కచేరీలోనైతే తాన్పురా మీటుతూ కూర్చున్న దొడ్డప్ప - తేటగా, నిశ్చింతగా, అత్యంత సహజంగా - పెదాలతో పళ్లను కప్పుకోవాల్సిన అవసరంలేని దొడ్డప్ప. కొన్నింటిలో తండ్రి వెంట కూర్చుని సహగానం చేస్తున్న విఠోబా.


ఉపాహారం తీసుకున్నదాకా వదల్లేదు దొడ్డప్ప.

"ఆ పిల్లాడిది 'వీరి' స్వగ్రామమే. దూరపు బంధువులు కూడా - వీరి సిఫారసుతోటే ఆ ఉద్యోగం దొరికింది" తరువాత కాసేపటికి చెప్పింది దొడ్డప్ప - "అమ్మాయిని చూ సొచ్చిన తరువాత మాతో కూడా అన్నాడు అమ్మాయి చాలా బాగుంటుందనీ. మూగ అయినా సరే చేసుకుంటాననీ - నేనూ వివరాలు అడగలేదు. అడిగితే తెలిసేదేమో మీ అమ్మాయని - పది రోజుల క్రితమేమొ ఉద్యోగం చేస్తూన్న మరొక పిల్లని చూశానని సెటిల్ కావచ్చనీ చెప్పాడు. అదేమిటీ అంత చక్కటి పిల్ల అన్నావు - మరిప్పు డేమో ఉద్యోగం చేస్తున్న పిల్ల అంటున్నావు - ఏది ప్రధానం నీకు అ నడిగేను. ఉద్యోగం చేస్తూన్నది కదా అని నసిగాడు. మొన్న వచ్చి పెళ్లి పిలుపు ఇచ్చాడు. రేపే తిరుపతిలో పెళ్లి - మేం వెళ్తున్నాం."

నేను తల వంచుకుని వింటున్నాను.

"వీరు మందలించారు కూడా - ప్చ్ ప్చ్ - ఒక్కొక్కరి ఆలోచనలూ! హూఁ చిత్రంగా ఉంటయ్ -"

విష్ణు గారు సానుభూతిగా నవ్వి పెదవి విరిచేడు "అదే - వాడు నెలసరి రొక్కం సంపాదనని చూసుకున్నట్లున్నాడు - పిచ్చికుంక -"




దొడ్డప్ప నిట్టూర్చింది - "మొత్తాని కిదేదో చిత్రమైన నాటకం లాగుంది రాజా!"

ఏకీభవిస్తున్నట్లు నవ్వాడు విష్ణు గారు - "సృజన! సృజన ఉండాలి దొడ్డప్పా!"

"అంతే నండీ -" ఉద్వేగంతో అన్నది దొడ్డప్ప - "ఏమో - దాని నొసట ఇంతకంటే మంచి సంబంధం రాసి ఉందేమో."

అప్పుడు చెప్పాను దొడ్డప్పకి - "దానికి మాట ఒక్కటి రాదనే గాని దొడ్డప్పా! అన్ని పనులూ వచ్చు - చాలా చురుకైన పిల్ల - వంటలో దానిది అమృత హస్తమే - కుట్టుమిషన్ నేర్చుకుంది. ఎంబ్రాయిడరీ నేర్చుకుంది. ఇల్లు శుభ్రంగా తీర్చినట్లు ఉంచుతుంది. నా బిడ్డ అని చెప్పట్లేదు దొడ్డప్పా -" అంటూంటే కళ్లలో నా బిడ్డ మెదలి మనకబారింది - వేదనతో గొంతు మూగబోయింది.

గ్రహించి చప్పున నా చేతిపై చేయి ఉంచారు అట్నుంచి విష్ణు గారూ, ఇట్నుంచి దొడ్డప్పా ఒకేసారి - "ఊర్కో రాజా! ఇప్పు డేమైందనీ? ఇది చిట్లిపోవడమే మంచిదైం దనుకో -" అంటూ అనునయించింది దొడ్డప్ప.

నా చేతిని నొక్కుతూ తాత్త్వికంగా నవ్వేడు విష్ణు గారు - "చూడండీ! అంతా భగద్విలాసం - ఈ ప్రపంచం ఉంది చూడండి - ఇది ఎవరి సొంతమూ కాదు; కుంటీ, గుడ్డీ, మూగా, రూపసీ, కురూపీ - అందర్నీ ఆ భగవంతుడే గదా సృష్టించాడు! ఆయన తలచుకుంటే మూగని పలికించనూ గలడు - కుంటి వాడి చేత కొండల్ను దూకించనూ గలడు. బీథోవెన్ అనే గొప్ప సంగీతకారుని పేరు మీరు వినే ఉంటారు. ఆయనకు చెవు డుందిట. నన్ను చూడండి - పుట్టు గుడ్డిగా పుట్టాను - నాకు కళ్లిచ్చేడా లేదా భగవంతుడు" అంటూ తడిమి దొడ్డప్ప చేతిని వెదుకున్నా డాయన - "ఇంత ముందు చూపూ, పెద్ద చూపూ, లో చూపూ ఉన్న కళ్లు నా కిచ్చేడా లేదా భగవంతుడు!"

దొడ్డప్ప కళ్లు టపటప లాడి మెరవసాగినయ్ - 'చూశావా ఆయన ధోరణి!' అన్నట్లు చూసింది.

"కాబట్టీ - మీ రేమీ దిగులు పడకండి - ఏదో దారి ఏర్పరచే ఉంటాడు భగవంతుడు."

"నీ అడ్రసు వివరంగా ఇవ్వు రాజా - వెళ్లగానే అమ్మాయి ఫోటో పంపించు" అని "విఠూ - అడ్రస్ రాసుకో నాన్నా" అని కొడుక్కు చెప్పింది దొడ్డప్ప.

విఠోబా తెచ్చిచ్చిన పుస్తకంలో నా అడ్రసు వివరంగా రాశాను.

"మరి ఇంక శలవు తీసుకుంటా నండి - " విష్ణు గారి రెండు చేతుల్నీ నా చేతుల్లోకి తీసుకున్నాను - "ఈ రూపేణా మిమ్మల్ని కలుసుకోనడం - చాలా సంతోషంగా ఉంది."

"సంతోషం - సంతోషం - చాలా సంతోషం" అన్నాడు విష్ణు గారు తనూ లేచి నిల్చుని.

దొడ్డప్పా, విఠోబా కింది దాకా వచ్చారు.

"వె ళ్లొస్తాను దొడ్డప్పా - వస్తాను బాబూ" అన్నాను.

"మంచిది - నువ్వు వెళ్లగానే అమ్మాయి ఫోటో పంపించు రాజా - మరచిపోకు" అని దగ్గరగా వచ్చింది దొడ్డప్ప - "ను వ్వేమీ దిగులు పెట్టుకోకు రాజా" అంది ఆత్మీయంగా.

ఆ కాసేపటిలో నా మనస్సు యేమేమి ఆలోచనలు చేసిందో చెప్పలేను - ఉహూఁ - చెప్పను. కానీ చెప్పాల్సిన అవసరం ఉం దనుకోను.

దొడ్డప్ప అంతా గ్రహించే ఉంటుంది. విష్ణుగా రన్నట్లు ఆమెది ముందు చూపూ, పెద్ద చూపూ, లో చూపూ మాత్రమే కాదు. అతని సాహచర్యంలో ఆమెది దివ్యదృష్టే అయింది.

మూగవాడిలా వాళ్లను చూసి రోడ్డు మీదికి నడుస్తూన్న ఆ క్షణంలో దొడ్డప్ప కనుల నుంచి ప్రసరిస్తూన్న కారుణ్య దృష్టి నా కొక కొత్త ధైర్యాన్నిచ్చిం దనుకుంటాను.

అప్పుడు నా కెందుకనో నరసింహ శతకంలోని పద్యం - చిన్నతనంలో చదివిన సంగతి కూడా మరచిపోయిన పద్యం - చప్పున గుర్తుకు రాసాగింది .

గుర్తు చేసుకుంటూ నడిచాను - 'అడవి పక్షి కెవ్వ డాహార మిచ్చెను? మృగ జాతి కెవ్వడు మేత బెట్టె? వనచరాదులకు భోజన మెవ్వ డిప్పించె? చెట్ల కెవ్వడు నీరు చేది పోసె?...